క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

బంట్వారం: కోట్‌పల్లి మండల సర్వసభ్య సమావేశం సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమీక్షకు ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



హోమం నిర్వహిస్తున్న దంపతులు, భక్తులు

తాండూరు టౌన్: తాండూరు పట్టణ శివారు ఖాంజాపూర్ గేట్ సమీపాన శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. రాజీవ్ స్వగృహలో నివాసముంటున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రేషం బిచ్చప్ప, విజయలక్ష్మి దంపతులు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన, హోమం, నవగ్రహ పూజ, అన్నదానం నిర్వహించారు. వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముదిరాజ్ గ్రామ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

కుల్కచర్ల: ముదిరాజ్ సంఘం మరికల్ గ్రామ కమిటీని ఆదివారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా మెడిపల్లి నర్సింహులు, అధ్యక్షుడిగా చిన్నప్ప, ప్రధాన కార్యదర్శిగా పిట్ల నర్సింహులు, కోశాధికారిగా లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడిగా బోయిని శివయ్య, పోలెపల్లి శ్రీను, ఉపాధ్యక్షురాలు లావణ్య, కార్యదర్శులుగా వెంకటేశ్, చందు, భీమయ్య, అంజయ్య, ఎం.వెంకటేశ్ తదితరులను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడారు. ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో భానుప్రకాష్, చెన్నప్ప, వెంకటయ్య, అంజయ్య, సాయిలు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు కృషి

సంఘం మండల అధ్యక్షుడు నర్సింహులు



నూతన కమిటీ సభ్యులతో ముదిరాజ్ సంఘం నాయకులు

చేవెళ్ల: ముదిరాజ్‌లంతా ఐక్యంగా ఉండి హక్కుల సాధనకు కృషిచేయాలని సంఘం మండల అధ్యక్షుడు ఉరడి నర్సింహులు అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలో ఆదివారం ముదిరాజ్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభాకు అనుగుణంగా రాజకీయ అవకాశాలు రావడం లేదని, దీనిపై ముదిరాజ్‌లు ఐక్యంగా పోరాడాలన్నారు. అనంతరం మండల సంఘం, యూత్‌కమిటీలను వారు ఎన్నుకున్నారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా ఊరేళ్ల గ్రామానికి చెందిన ఉరడి నర్సింలు, ఉపాధ్యక్షులుగా సునుగంటి శ్రీకాంత్ (మల్కాపూర్), బి గణేశ్(గుండాల), కె. వెంకటేశ్‌బాబు(అంతారం), బి. గోపాల్(కమ్మెట), ఉరడి వెంకటేశ్(ముడిమ్యాల), ప్రధానకార్యదర్శులుగా తెలుగు రాజశేఖర్(దామరగిద్ద), ఉరడి రాంప్రకాశ్(ఊరేళ్ల), కె. బాబు(పామెన), సీహెచ్ శివరాజ్(మల్కాపూర్), కోశాధికారులుగా ఎం. గోపాల్(మీర్జాగూడ), కె. శ్రీనివాస్(గుండాల), ప్రచార కార్యదర్శిగా తెలుగు వెంకటేశ్(పామెన)లను, సభ్యులుగా ఎం. ప్రభు, యు. నర్సింలు, క్రిష్ణ, హన్మంత్ తదితరులను ఎంపిక చేశారన్నారు. యూత్‌కమిటీలో అధ్యక్షుడిగా తెలుగు శ్రీనివాస్(చేవెళ్ల), ఉపాధ్యక్షులుగా తెలుగు నవీన్(అంతారం), టి. క్రిష్ణమోహన్, వెంకటేశ్(పామెన), సీహెచ్ యాదగిరి(మల్కాపూర్), కె. వెంకటేశ్(గుండాల), ప్రధాన కార్యదర్శులుగా అనిల్, మహేశ్, రాజశేఖర్, జనార్దన్, శివకుమార్‌ను ఎంపిక చేశారన్నారు. ఈ కమిటీలు ముదిరాజ్‌ల ఐక్యత కోసం కృషి చేయాలన్నారు.

వైఎస్సార్ సేవలు మరువలేనివి

టీటీడీ బోర్డు తెలంగాణ అడ్వైజర్ కమిటీ సభ్యుడు ప్రతాప్‌రెడ్డి

చేవెళ్ల: వైఎస్సార్ సేవలు మరువలేనివని ఆయన అభిమానులు, కార్యకర్తలు తెలంగాణలో ఎంతో మంది ఉన్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు, టీటీడీ బోర్డు తెలంగాణ అడ్వైజర్ కమిటీ మెంబర్ కేసారం ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం చేవెళ్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులతో త్వరలో ఒక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణలో ఏ రాజకీయపార్టీకి అనుకూలంగా ఉండాలనే దానిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమీక్ష తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశానికి ముఖ్య నాయకులను ఆహ్వానిస్తామని ఆయన పేర్కొన్నారు.

దిగుబడి తగ్గి.. ధర పెరిగి..

- మినుము, పెసర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.10వేల పైనే..
- బహిరంగ విపణిలో రికార్డు ధర
- సకాలంలో వానలు కురవక పెట్టుబడులు కోల్పోతున్న రైతులు



తట్టెపల్లిలో మినుము పంటను యంత్రంలో వేస్తున్న రైతులు

పెద్దేముల్: మినుము, పెసర పంటలకు మార్కెట్లో రికార్డు ధర పలుకుతోంది. గతంలో దిగుబడి ఉన్నా, మద్దతు ధర దక్కేది కాదు. ప్రస్తుతం విపణిలో ధర ఉన్నా.. ఆశించినంత దిగుబడి లేదని రైతులు చెప్పారు. పెసర, మినుముకు గతంలో క్వింటాకు రూ.8వేలు కూడా ఉండేది కాదని, ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.10వేల వరకు గరిష్ఠంగా ధర పలుకుతోందని వ్యాపార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలో మినుము సుమారు 11వేలు, పెసర 6వేల ఎకరాల వరకు సాగైనట్లు వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా తెలుస్తోంది.

తగ్గిన దిగుబడి

పెద్దేముల్ మండలం తట్టెపల్లి, నర్సాపూర్, నాగులపల్లి, రుద్రారం, ఇందూరు, మారేపల్లి, హన్మాపూర్, గిర్మాపూర్, జైరాంతండా తదితర గ్రామాల్లో మినుము 1,110, పెసర 970, కంది 12,500 ఎకరాల్లో రైతులు సాగు చేసినట్లు ఏఓ నజీరొద్దీన్ తెలిపారు. విత్తనాలు విత్తే సమయంలో వర్షాలు లేక, పంటలు ఎదిగే సమయంలో భారీ వర్షాలు కురవడం, సమయానికి కలుపు తీయక దిగుబడి తగ్గినట్లు రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. గతంలో వర్షాలు బాగా కురిసి, పంటలు సమృద్ధిగా పండేవని, ఎకరా పొలంలో సుమారు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల వరకు మినుములు, ఎకరాకు మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల వరకు పెసర దిగుబడి వచ్చేదని, ప్రస్తుతం ఎకరాకు క్వింటా దిగుబడి రావడం లేదని, పెట్టిన పెట్టుబడులు దక్కడం లేదని కొందరు అన్నదాతలు చెప్పడం గమనార్హం.

సరిపోని సాయం

యేటా ఎరువుల ధరలు, కూలీల పెట్టుబడులు రెండింతలుగా పెరుగుతున్నాయని, గతంలో కలుపు తీయడానికి రూ.200 నుంచి రూ.250 కులీలకు ఇచ్చేవారమని, ప్రస్తుతం రూ.500లు చెల్లించినా కూలీలు దొరకడం లేదని రైతులు వాపోతున్నారు. మూడేళ్లుగా అధిక వర్షాలు కురవటంతో పెసర, మినుము పంటలు చేతికి అందడం లేదని, దీంతో పత్తి, కంది పంటలపై ఆధార పడి జీవనం సాగిస్తున్నామని రైతులు చెప్పారు. పెసర, మినుము పంటలు అనుకూలంగా ఉంటే పత్తి, కంది పంటలకు పెట్టుబడుల ఇబ్బంది ఉండేది కాదని, ప్రస్తుతం పంటలు కోల్పోవటంతో అప్పులు చేయక తప్పడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ.10వేలు పెట్టుబడి ఇచ్చినా ఎరువులు, మందులకే సరిపోవడం లేదని, దీంతో అప్పులు చేయక తప్పడం లేదని అంటున్నారు.

వెలవెల బోతున్న మార్కెట్

ప్రస్తుతం మార్కెట్లో మినుము క్వింటాకు మద్దతు ధర రూ.6,950, పెసరకు రూ.8,558 ఉందని, బహిరంగ విపణిలో వీటికి సుమారు రూ.10వేల వరకు పలుకుతోందని పలువురు రైతులు చెప్పారు. గతంలో సెప్టెంబర్ మాసం వచ్చిందంటే తాండూరు మార్కెట్లో పెసర, మినుముల రాశుల కళకళ ఉండేదని, ప్రస్తుతం సాగు లేక మార్కెట్లు వెలవెల బోతున్నాయని వ్యాపారులు స్పష్టం చేస్తున్నారు.

మూడు ఎకరాల్లో రెండు క్వింటాళ్లు



మూడు ఎకరాల్లో మినుము సాగుచేశాను. గతంలో సుమారు 10నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ఈ యేడు సమయానికి వర్షాలు కురవక మూడు క్వింటాళ్ల దిగుబడి లేదు. పెట్టుబడులు మాత్రం రెండింతలు పెరిగాయి. వ్యవసాయం తప్ప మరే ఆదారం లేదు. చివరకు కంది పంటనే ఆదేరు. దానినే నమ్ముకొని ఉన్నా.

– దేవప్ప, రైతు, తట్టెపల్లి

పెట్టుబడి పెరిగింది



గతంతో పోలిస్తే ఈ యేడు పెట్టుబడులు పెరిగాయి. కూలీల డిమాండ్, యంత్రాల కొరత తీవ్రమైంది. ఐదు ఎకరాల్లో మినుము సాగు చేశా. రూ.లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. ఎకరాకు మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. సమయానికి వర్షాలు కురిస్తే ఎకరాకు మరో క్వింటా వచ్చేది.

– రవి నాయక్, రైతు, పెద్దేముల్ తండా

రైతులను నమ్మడం లేదు



అధిక వర్షాలతో మూడేళ్లుగా పంటలు పాడవుతున్నాయి. భూమిని నమ్ముకొని బతుకుతున్నం. వ్యవసాయం తప్ప మరో ఆదారం లేదు. పంటలు కోల్పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఎరువుల ధరలు యేటేటా భగ్గు మంటున్నాయి. గతంలో ఎరువులు, మందులు ఉద్దెరకు లభించేవి. ప్రస్తుతం రైతులను ఎవరు నమ్మడం లేదు.

– మల్లప్ప, రైతు, గొట్లపల్లి

కొనసాగుతున్న ఓటరు నమోదు ప్రక్రియ



దరఖాస్తు చేసుకుంటున్న గ్రామస్తులు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మొత్కూరి వెంకటేశ్ మాట్లాడారు. వయోజనులందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటు హక్కుకోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అభివృద్ధిలో నంబర్ వన్



ఎంపీ రంజిత్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న సర్పంచ్ తదితరులు

మొయినాబాద్ రూరల్: అభివృద్ధిలో తెలంగాణను దేశంలో నంబర్ వన్‌గా సీఎం కేసీఆర్ నిలిపారని టీటీడీ బోర్డు సభ్యురాలు సీత అన్నారు. సీత ప్రమాణ స్వీకారం అనంతరం హైదరాబాద్ చేరుకున్న సందర్భంగా ఆమెను సర్పంచ్‌ల సంఘం మహిళా అధ్యక్షురాలు, సర్పంచ్ శోభవెంకట్‌రెడ్డి సన్మానించారు.

రేవంత్ సమక్షంలో పార్టీలో చేరిక



పార్టీలో చేరిన వారితో రేవంత్‌రెడ్డి, నాయకులు

బొంరాస్‌పేట: సూర్యానాయక్ తండాకు చెందిన సుమారు వంద మంది ఆదివారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని రేవంత్ నివాసంలో తండాకు చెందిన సురేశ్, అనిల్, మోతీలాల్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు గౌడ్ తెలిపారు. ఇందులో పార్టీ మండల నాయకులు భీమయ్యగౌడ్, మల్లేశ్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ భూస్థాపితం ఖాయం

- నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం
- కార్యకర్తలకు లబ్ధి చేకూరుస్తోంది
- మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ ధ్వజం



పార్టీలో చేరిన వారితో మాజీమంత్రి

మర్పల్లి: ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ భూస్థాపితం కావడం ఖాయమని, అందుకు ప్రజలు సిద్ధం అవుతున్నారని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రానికి చెందిన పలువురు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్.. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. దళిత వర్గాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని, ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు ఇస్తానని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం.. కేవలం బీఆర్‌ఎస్ కార్యకర్తలకే లబ్ధి చేకూరుస్తూ.. అర్హులను విస్మరిస్తోందని మండిపడ్డారు.

ప్రజల్లో వ్యతిరేకత

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లతో పాటు, పలు సంక్షేమ పథకాలు అందజేసినట్లు మాజీ మంత్రి చెప్పారు. ఇప్పుడు బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందటం లేదని పేర్కొన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం పై ప్రజల్లో వ్యతిరేకిస్తూ.. కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పడుతున్నారని వెల్లడించారు. పార్టీలో చేరిన వారిలో శ్రీనివాస్, మధుకర్, బరత్, అరుణ్, శ్రీనివాస్‌తో పాటు మరో 50 మంది మైనార్టీ కార్యకర్తలు ఉన్నారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, మండల ఉపాధ్యక్షుడు సలీం, ప్రభాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాచన్న, రఫీ, బీసీసెల్ మండల అధ్యక్షుడు సర్వేశ్, సీనియర్ నాయకులు మల్లేశ్‌యాదవ్, మైనార్టీ సెల్ మండల సీనియర్ నామయకులు ఖయూం, ఎస్సీసెల్ జిల్లా నాయకులు గణేశ్, మండల నాయకులు శేఖర్ గుప్తా, ఖాసీంఖాన్, శివ, బలవంత్‌రెడ్డి ఉన్నారు.

విద్యాప్రమాణాలకు ప్రాధాన్యత



విద్యార్థులకు పుస్తక సామగ్రి అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

దోమ: చిన్నారుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించడమే తమ లక్ష్యమని ప్రథం సంస్థ మండల కోఆర్డినేటర్ మురళీకృష్ణ అన్నారు. ఆదివారం దోమ మండలం కొండాయపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నాగరాజుతో కలిసి విద్యార్థులకు పుస్తక సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి మెరుగైన ఉత్తీర్ణత సాధించాలంటే.. ఈ మెటీరియల్స్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గుణింతాల చార్ట్, సంఖ్యచార్ట్, గుణిజాల చార్ట్ తదితర వాటిని విద్యార్థులకు అందజేశామని, వీటి ద్వారా ఉన్నతమైన విద్యను అభ్యసించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహం నిలిపివేత

శంకర్‌పల్లి: విశ్వసనీయ సమాచారంతో చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు బాల్య వివాహాన్ని అడ్డుకున్న సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. చైల్డ్ హెల్ప్‌లైన్ ఇన్‌చార్జి సంతోష తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం మహబూలింగాపురం గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్లో 17 సంవత్సరాల బాలికకు వివాహం జరుగుతుందనే సమాచారం మేరకు అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో ఆమె షీటీమ్ ఏఎస్‌ఐ సంపత్‌కుమార్, శంకర్‌పల్లి ఎస్‌ఐ సత్యనారాయణలతో విచారణ చేపట్టారు. ఈ విచారణలో మైనర్ అని నిర్ధారించుకున్న అనంతరం ఆ వివాహాన్ని అధికారులు నిలిపివేశారు. అనంతరం వారు తల్లిదండ్రులకు వధూవరుకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలికకు మైనార్టీ తీరిన తరువాత వివాహం చేయాలని అధికారులు తల్లిదండ్రులకు సూచించారు. కాదని మళ్లీ వివాహం చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

అమ్డాపూర్ పాఠశాలలో జోనల్ స్థాయి క్రీడలు

జోనల్ కార్యదర్శి బాలస్వామిరెడ్డి

మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో రాజేంద్రనగర్ జోనల్ స్థాయి క్రీడలు నిర్వహించనున్నట్లు జోనల్ క్రీడల కార్యదర్శి బాలస్వామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని అమ్డాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తేదీన 14–17 సంవత్సరాల బాలబాలికలకు ఖో–ఖో టోర్నమెంట్ నిర్వహిస్తారన్నారు. రాజేంద్రనగర్, గండిపేట్, శంషాబాద్, మెయినాబాద్ మండలాలలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు వారి బోనఫైడ్, ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు. మరింత సమచారం కోసం 9866706457లో సంప్రదించాలని ఆయన కోరారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే



నూతన వధూవరులతో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, నాయకులు

బొంరాస్‌పేట: పలు వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆదివారం బొంరాస్‌పేట మండలం తుంకిమెట్ల, ఏర్పుమళ్ల, దుద్యాల మండలం హకీంపేటలో జరిగిన వివాహ శుభకార్యాల్లో ఎమ్మెల్యే పాల్గొని సందడి చేశారు. ఆయన వెంట పార్టీ ఇరు మండలాల నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శేరినారాయణరెడ్డి, మహేందర్‌రెడ్డి, చాంద్‌పాష, మధుయాదవ్, తిరుపతయ్య, మల్లేశ్‌గౌడ్, అంజిలయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

బీసీల అభివృద్ధికి నిరంతరం కృషి



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ అనితారెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి సురేందర్‌రెడ్డి

- సర్పంచ్ అనితారెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి సురేందర్‌రెడ్డి
- రూ.10 లక్షలతో బీసీ భవన నిర్మాణానికి భూమిపూజ

షాబాద్: బీసీల అభివృద్ధికి నిరంతరం తమ వంతు కృషి చేస్తామని గ్రామ సర్పంచ్ పీసరి అనితారెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి గ్రామంలో సొంత ఖర్చులతో రూ.10 లక్షలతో బీసీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలను ఎల్లప్పుడూ అందిస్తామన్నారు. బీసీ భవనానికి సొంతంగా భూమి, రూ.10 లక్షల నిధులు కేటాయించిన్నట్లు తెలిపారు. బీసీల అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు. ఏట్ల ఎర్రవల్లి గ్రామంలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. సీసీ రోడ్లు, అండర్‌గ్రౌడ్ డ్రైనేజీల నిర్మాణం పూర్తి చేసిన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం

పీసీసీ సభ్యుడు దర్శన్



విజయ్‌రాజ్‌కు నియామకపత్రం అందజేస్తున్న షాబాద్ దర్శన్

మొయినాబాద్: మూడు నెలల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్ ధీమా వ్యక్తం చేశారు. నాగిరెడ్డిగూడ గ్రామంలో కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగిపోయారన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాబోయే మూడు నెలలు అధికారమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఎర్ర విజయ్‌రాజ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహేందర్‌లను ఎన్నుకొని నియామక పత్రాలు అందజేశారు. మండల అధ్యక్షుడు మాణయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ రాంరెడ్డి, మహేందర్ ముదిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, జంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, నిరంజన్‌గౌడ్, అనంతరెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకటేశ్, జైపాల్‌రెడ్డి, భిక్షపతి, రాజుగౌడ్, సంజీవ, సుధాకర్, సుకుమార్ ఉన్నారు.

చిగురించిన ఆశలు



మోమిన్‌పేట: ఎన్కేపల్లిలో కళకళలాడుతున్న పత్తి పంట

నెల రోజులుగా వాన జాడ కానరాక రైతన్నలు పంటలపై ఆశలు వదులుకుంటున్న నేపథ్యంలో శనివారం కురిసిన వర్షాలు వారిలో ఆశలు రేకెత్తించాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ధారూరు మండల పరిధిలో 8.4 సె.మీ. పైగా వర్షం కురవటంతో అన్నదాతల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ వానలతో లోతట్టు ప్రాంత పొలాల్లో వరద నిలవగా.. ఆ నీటిని కాల్వల ద్వారా బయటకు పంపించేందుకు రైతులు శ్రమిస్తున్నారు.

– ధారూరు

గిట్టనివారి రాద్ధాంతం

- గడువు ముగిశాకే భూమి విక్రయించా
- స్థల యజమాని వెంకట్రాములు



మాట్లాడుతున్న వెంకట్రాములు

పరిగి: గిట్టని వారు కొందరు తనను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో రాద్ధాంతం చేస్తున్నారని, గడువు ముగిశాకే తన భూమిని విక్రయించానని స్థల యజమాని వెంకట్రాములు చెప్పారు. 'భూ రిజిస్ట్రేషన్ విషయంలో తనకు అన్యాయం జరిగిందంటూ' గత నెల 31న ఓ గిరిజన వ్యక్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి యత్నించిన విషయం తెలిసిందే.. ఇదే విషయమై ఆదివారం పట్టణ కేంద్రంలో భూ యజమాని మాట్లాడారు. పరిగి మండలం రాఘవపూర్ గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 94, 95, 96లలో 22.26 ఎకరాల భూమిని తాను 2002లో ఇతరుల నుంచి కొనుగోలు చేశానని ఆయన చెప్పారు. ఈ భూమిని గతేడాది జులైలో మేఘరాజు, సుదర్శన్‌లకు అగ్రిమెంట్ చేశానని పేర్కొన్నారు. వారికి మూడు నెలల గడువు ఇచ్చినప్పటికీ.. 13 నెలల పాటు కాలయాపన చేశారని తెలిపారు. భూమి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పలు మార్లు చెప్పినా జాప్యం చేశారని, తన అవసరం నిమిత్తం వేరే వ్యక్తులకు విక్రయించానని వెంకట్రాములు వివరించారు.

ఎవరినీ మోసం చేయలేదు..

తాను అగ్రిమెంట్ చేసిన వ్యక్తుల్లో మేఘరాజు అనే వ్యక్తి తన ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు నోటరీ కూడా ఇచ్చారని, అప్పుడే తాను వేరే వ్యక్తులకు విక్రయించానని ఆయన వెల్లడించారు. భూ లావాదేవీల్లో కొంత మంది తనను ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులకు గురిచేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తనకు ప్రాణహాని ఉందని, ఈ విషయం పోలీసుల దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరినీ మోసం చేయలేదని, సేవాదృక్పథంతోనే తన పట్టా భూమిలో ఎకరా పొలాన్ని శ్మశాన వాటికకు ఇచ్చానని తెలిపారు. గడువు ముగిసినందునే స్థలాన్ని ఇతరులకు విక్రయించానని, ఎవరు నష్టపోకుండా.. మాట తప్పకుండా అగ్రిమెంట్ దారులకు రెండింతల డబ్బులు తిరిగి ఇస్తానని స్పష్టం చేశారు.